ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-కొనకనమిట్ల : తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నేడు అనగా సోమవారం జరగనున్న దృష్టి మండల కేంద్రమైన కొనకనమిట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పరిశీలించారు. పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల గదులను పాఠశాల పరిసరాలను నిచితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్‌తో పాటు ఎంపీడీవో జనార్ధన్, తాసిల్దార్ ప్రసాదరావు, వీఆర్వో రఘురామయ్య, పంచాయతీ కార్యదర్శి కె రాజకుమారి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

అక్షరాస్యత వైపు అడుగులు - దేశ ప్రగతికి తొలి మెట్టు

విశాలాంధ్ర-తాళ్లూరు : అక్షరాస్యత వైపు అడుగులు వేయడం దేశ ప్రగతికి తొలి మెట్టుగా భావించవచ్చని అమెరికన్ పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకులు పులి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బొద్దికూరపాడు గ్రామానికి చెందిన అమెరికన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులతో ఆదివారం నాగంబొట్లవారిపాలెం గ్రామంలో విద్య అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ సిహెచ్ సుబ్బారావు, బీసీ సంఘ సీనియర్ నాయకులు సూరిబాబు జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించారు. అనంతరం పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకులు పులి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలను చైతన్యపరిచి విద్య యొక్క గొప్పతనాన్ని చూపుతూ నిరక్షరాస్యతను నివారించాలన్నారు. మండల బీసీ సెల్ అధ్యక్షులు పిన్నిక రమేష్, అమెరికన్ పబ్లిక్ స్కూల్ చైర్ పర్సన్ పులి శిరీష, పాఠశాల కరస్పాండెంట్ జి ప్రసూన, ప్రధానోపాధ్యాయులు రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం నాగరాజు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో బండలాగుడు పోటీలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గార్లదిన్నె పంచాయతీలో గల వెలుగొండ క్షేత్రంలో కొలువైన వెలుగొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న వెలుగొండ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 15 16 తేదీలలో ఆంధ్ర తెలంగాణ రాష్ట్రస్థాయి ఎడ్ల బలపదర్శన బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి తెలిపారు. 15న 2 పండ్ల సైజువిభాగం 6 పండ్ల సైజు విభాగం 16న సీనియర్ విభాగాలలో ఎడ్ల బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు. ఆయా విభాగాల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి రెండవ మూడవ నాలుగవ బహుమతులు ఇవ్వడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి పోటీల నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ పోటీలు ఆలయ కమిటీ చైర్మన్ మేకలవారిపల్లి రెడ్ల సంఘం ఆధ్వర్యంలో సాగుతాయన్నారు.

బహుమతుల వివరాలు : రెండు పండ్ల సైజు విభాగంలో గెలుపొందిన హెడ్లెజమానులకు మొదటి బహుమతి 20000 రెండో బహుమతి 15000 మూడో బహుమతి 10000 నాలుగో బహుమతి 5000 ఆరు పండ్లసైజు విభాగంలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి బహుమతి 35000 రెండవ బహుమతి 25000 మూడో బహుమతి 15000 నాలుగో బహుమతి 10000 సీనియర్ విభాగంలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి బహుమతి 50,000 రెండో బహుమతి 30000 మూడవ బహుమతి 20000 నాలుగో బహుమతి 15000 అందజేయడం జరుగుతుందన్నారు పోటీల్లో పాల్గొని ఎడ్ల యజమానులు ఎంట్రీ ఫీస్ చెల్లించి వారి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8179921128, 9581137317, 9912032442 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలులో ఎంపీపీ కామూరి అమూల్య ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందరరేగా ఎంపీపీ కామూరి అమూల్య ఎంపిటిసిలు చెన్నారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కామూరి శ్రీనివాసరెడ్డి, మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కామూరి అమూల్య మాట్లాడుతూ సీఎం జగనన్న పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి పేద కుటుంబాలను ఆదుకున్నారని అన్నారు. ఆయన స్థాపించిన పార్టీ 13 సంవత్సరాలు పూర్తి చేసుకోవటం అందరికీ ఎంతో ఆనందంగా ఉందని మళ్లీ ఆయనే 2024 ఎన్నికలలో సీఎంగా గెలుస్తారని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కామూరి రమణారెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

ప్రైవేటు కార్యక్రమంలో ముత్తుముల

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని గోపాలునిపల్లె గ్రామంలో చల్లగొలుసుల శేఖర్‌బాబు శ్రీమతి సుజాతల కుమార్తె కీర్తి మరియు అనిల్ కుమార్‌ల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి గిద్దలూరు టిడిపి ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జండా మోసిన ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటామని దయచేసి పార్టీ కించపరిచేలా ఎవరు మాట్లాడకండి అన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అచ్చం నాయుడు. రాబోయే రోజుల్లో మీ అందరి సహకారంతో వైయస్ జగన్మోహన్‌రెడ్డిని మరల ముఖ్యమంత్రిని చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ఉడుముల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, యర్రగొండపాలెం మండల కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎంపీపీ దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, యర్రగొండపాలెం సర్పంచ్ అరుణా భాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

విశాలాంధ్ర-పామూరు : సోమవారం జరుగు ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లకు తావు లేకుండా నిష్పక్షపాతముగా నిర్వహించాలని పారిశ్రామికవేత్త టిడిపి నాయకులు కోటపాటి జనార్ధన్ అధికారులకు విన్నవించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో పోలింగ్ విషయంలో ఏజెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీగా దొంగఓట్లను నమోదు చేసిందని, ఎన్నడు లేని విధంగా ఉపాధ్యాయులను డబ్బులకు ఎరవేసిందని అన్నారు. ప్రబోధాత్మకంగా ఓటర్సు తమ ఇష్టానుసారం ఓటు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి దొంగ ఓట్లను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాల్సిందిగా జనార్ధన్ సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాజు యాదవ్, ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యదర్శి సయ్యద్ ఆమీర్ బాబు, మాజీ జెడ్పిటిసి హుస్సేన్ రావు యాదవ్, గల్లా చెన్నయ్య,పట్టణ టిడిపి అధ్యక్షులు కాజా రంతుల్లా, మండల తెలుగు రైత్ అధ్యక్షులు మన్నం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆశయ సాధనకు వైసీపీ ఆవిర్భావం

విశాలాంధ్ర-పామూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 13 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆ పార్టీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. వైసీపీ మండల అధ్యక్షులు గంగాసాని హుస్సేన్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి మరణాన్ని జీర్ణించుకోలేక అనేకమంది గుండెలు ఆగిపోయాయన్నారు. ఆ కుటుంబాలను పరామర్శించేందుకు జగన్మోహన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అనుమతి ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు. రాజశేఖర్‌రెడ్డి ఆశయాల సాధన కోసం జగన్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని స్థాపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కల్లూరు రామిరెడ్డి, జడ్పిటిసి చప్పిడి సుబ్బయ్య, వైస్ ఎంపీపీలు రసీదు, యేసు రత్నం, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ ఖాజా నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఉదయం 8 నుంచి 4 గంటల వరకు పోలింగ్
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సామాగ్రి
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. నేడు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి ఎన్నికల సిబ్బంది సామాగ్రిని తీసుకొని ఆదివారం రాత్రికి ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే జిల్లా ఎస్పి పోలీసు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించగా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ మార్కాపురం, ఇతర ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్నికల సిబ్బందికి సూచనలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 138 పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకు సంబంధించి పట్టభద్రుల ఓటర్ల కోసం 98 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఓటింగ్ కోసం 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు ఎంఎల్‌సికి 82225 మంది ఓటు హక్కును వినియోగించుకోనుండగా ఉపాధ్యాయులు 5789 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 958 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి.

డబ్బుతో ఓట్లకు ఎర వేస్తున్న వైసీపీ

ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల గెలుపు కోసం వైసీపీ కోట్ల రూపాయలు డబ్బు ఖర్చు పెడుతుంది. ముఖ్యంగా ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానాన్ని కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉంది. ప్రభుత్వ ఉద్యోగుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత లేదని నిరూపించుకునేందుకు ఆ స్థానాన్ని ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుంది. వైసీపీలో ముఖ్యనేతలందరూ దీనిపైనే దృష్టి పెట్టారు. దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను కూడా ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి ఓటుకు ఐదు వేల నుంచి పదివేల వరకు ఇచ్చి తరలిస్తున్నారు. గ్రాడ్యుయేట్స్ వారికి కూడా 2 వేల వరకు ఇస్తున్నట్లు తెలుస్తుంది. మొత్తం మీద ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుకోసం దొంగ ఓట్లు చేర్పించుకునే దగ్గర నుంచి డబ్బు పంపిణీ వరకు అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ అధికార పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారు. వీరికి అధికారులు కూడా వత్తాసు పలుకుతున్నారు. దీనిపై సామాన్య ప్రజల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత, విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పీడీఎఫ్ గెలుపు తథ్యమంటున్న ఓటర్లు

అధికార పార్టీ నేతలు ఎన్ని కుయుక్తులు పన్నినా పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపు ఖాయమని తెలుస్తుంది. ఓటర్లు ఎక్కువ మంది పీడీఎఫ్ అభ్యర్థులకే మద్దతు పలుకుతున్నట్లు జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంఎల్‌సి ఎన్నికలు అధికార పార్టీ డబ్బుతో గెలవాలని చూస్తున్నప్పటికీ చదువుకున్న విజ్ఞత కలిగిన ఓటర్లు వాస్తవాలను పరిశీలిస్తున్నారు. అధికార పార్టీ నేతలు డబ్బును కొంత మంది ఓటర్లు తీసుకోకుండా బహిరంగంగా వ్యతిరేకించడం గమనార్హం. ఈ నేపథ్యంలో పీడీఎఫ్ అభ్యర్థుల పట్ల ఓటర్లు కూడా సానుకూలంగా ఉన్న వాతావరణం స్పష్టంగా కన్పిస్తుంది. తెలుగుదేశం పార్టీ కూడా రెండవ ప్రాధాన్యత ఓటును పీడీఎఫ్ అభ్యర్థులకే వేయాలని ప్రకటించిన విషయం విధితమే.

అంత్యక్రియలకు సూర్య శ్రీ ట్రస్టు ఆర్థికసాయం

విశాలాంధ్ర-ఒంగోలు : ఆపదలో ఉండి పేదరికంతో అంత్యక్రియలకు కూడా ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాన్ని అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం చేసి సూర్యశ్రీ ట్రస్టు తన దానగుణం చాటుకుంది. తెలగతోటి భరత్ అనే రిపోర్టర్ భార్య సుదర్శి కవిత గ్రేస్ క్యాన్సర్‌తో, తండ్రి ప్రభాకర్ రావు గుండెపోటుతో ఒకే రోజు ఇద్దరు ఒంగోలు రైల్వే గేట్ సమీపంలో భరత్ ఇంట్లో ఈరోజు చనిపోయారు. అత్యంత నిరు పేద కుటుంబం వారిది. శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాష వెంటనే స్పందించి డాక్టర్ కాకాని దీపిక రూ.5 వేలు మరి కొంతమంది దాతల సహకారంతో మట్టి ఖర్చులు నిమిత్తం ఆదివారం భరత్ నివాసానికి వెళ్లి 18616 రూపాయలు ఆర్థిక సాయాన్ని ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు సిటిజన్ ఫోరం అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా మధు చేతుల మీదుగా వారి కుటుంబానికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ మానవత్వంతో సూర్య శ్రీ ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ భాష స్పందించి దాతలు సహకారంతో ఇబ్బంది పడుతున్న భరత్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

'సుందరరాజా' హాస్పిటల్‌లో విజయవంతంగా తుంటి క్యాన్సర్ ఆపరేషన్

విశాలాంధ్ర-ఒంగోలు : గుంటూరు జిల్లాకు చెందిన 28 సంవత్సరాల యువతికి తుంటి ఎముకపై వచ్చిన క్యాన్సర్ గడ్డను విజయవంతంగా తొలగించినట్లు సుందర రాజ హాస్పిటల్ వైద్యులు సర్జికల్ అంకాలజిస్టు డాక్టర్ కౌశిక్ తెలిపారు. స్థానిక రాజా పానగల్ రోడ్డులోని సుందరరాజా హాస్పిటల్‌లో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కౌశిక్ మాట్లాడుతూ తుంటి ఎముకపై క్యాన్సర్ గడ్డ రావటంతో తుంటి ఎముక పూర్తిగా విరిగిపోయి నడవ లేని స్థితిలో హాస్పిటల్‌కు పేషెంట్ వచ్చారన్నారు. కాన్సర్ గడ్డ తొలగించిన తర్వాత విరిగిన తుంటి ఎముక స్థానంలో టైటానియం లోహంతో తయారు చేసిన ఎముకను అమర్చటం జరిగిందన్నారు. ఆపరేషన్ చేసిన రెండవ రోజు నుండే పేషెంట్ వాకర్‌తో నడుస్తున్నారని, మరో వారం రోజులలో వాకర్ సహాయం లేకుండా నడుస్తారని, మరో ఆరునెలల్లో తన పనులు పూర్తి స్థాయిలో చేసుకుంటారని తెలిపారు. చెన్నై, హైదరాబాద్ వంటి మహానగరాలకే పరిమితమైన ఈ ఆపరేషన్ కేవలం రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్య శ్రీ కింద చేయటం జరిగిందన్నారు. ఇదే ఆపరేషన్ బయట హాస్పిటల్‌లలో అయితే కనీసం రూ.5 నుండి 6 లక్షల వరకు ఖర్చు అయ్యేదని తెలిపారు. ఇటువంటి ఆపరేషన్ జిల్లాలో ఇదే ప్రథమమన్నారు.

కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించండి

విశాలాంధ్ర-పామూరు : వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు రాష్ట్రంలో యువత సిద్ధంగా ఉన్నారని సోషల్ మీడియా నాయకులు కోటపాటి నరేష్ అన్నారు. యువకులు శ్రామికులు ఉద్యోగుల సమస్యలపై శాసన మండలిలో గట్టిగా వాణి వినిపించ గలిగిన తూర్పు రాయలసీమ (చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు) పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిద్దాం అని పిలుపునిచ్చారు.

ఘనంగా 'విశ్వభారతి' వార్షికోత్సవం

విశాలాంధ్ర-దొనకొండ: చదువుకోవాలనే సంకల్పాన్ని విద్యార్థులలో పెంపొందించాలని దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి తెలిపారు. స్థానిక విశ్వభారతీ విద్యాలయం 6వ వార్షికోత్సవమును కరస్పాండెంట్ మల్లెల రామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళీ, ఎంఈఓ ఎన్.సాంబశివరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విద్యార్థులలో చదువుకోవాలనే సంకల్పాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. దేశంలో గొప్ప పేరు ప్రఖ్యాతలు సాధించిన వారంతా గ్రామాలలో విద్యను అభ్యసించిన వారే అన్నారు. చదువుతో పాటు ఆటలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. రస్పాండెంట్ రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి పిల్లల చదువులపై ఆరా తీసి అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవంను ఆదివారం స్థానిక శివసద నంలో తెలంగాణ నిర్వహించారు. ఈ సందర్భంగా దోర్నాల మండల పార్టీ కన్వీనర్ గంట రమణారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ భర్త గుమ్మా పద్మజ యల్లేష్, మరియు వైసీపీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దూదేకుల రసూల్, మల్లారెడ్డి, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారదులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయం రహదారిపై ఆటో బోల్తా

- భార్యాభర్తలు మృతి

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఆదివారం ఉదయం గిద్దలూరులోని చర్చికి ఆటోలో వెళుతుండగా కడప అమరావతి జాతీయ రహదారిపై ఓ కుక్క అడ్డం వచ్చింది. ఆటో డ్రైవర్ కుక్కను తప్పించబోయి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మందా రాజయ్య (62)కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య దానమ్మ(49)కు కూడా తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన గిద్దలూరు ఆసుపత్రికి తరలించారు. కాగా దానమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె కూడా తుది శ్వాస విడిచింది. కొమరోలు పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీజేఆర్ నీ ధన దాహం దళితులపైనా?

- మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుజన్ మాదిగ

కావూరి దేవదాసు భూమిని పరిశీలిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సృజన మాదిగ

విశాలాంధ్ర-మద్దిపాడు : సంతనూతలపాడు స్థానిక శాసనసభ్యులు టీజేఆర్ సుధాకర్ బాబు ఇది నీకు న్యాయమా. నీ ధన వ్యామోహం కేవలం దళితుల పైనేనా అని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుజన్ మాదిగ ప్రశ్నించారు. ఆదివారం మండలంలోని బూరెపల్లి గ్రామంలో గల బాధిత కావూరి దేవదాసు పొలాన్ని, మాదిగ సంక్షేమ పోరాట సమితి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా సుజన్ మాదిగ మాట్లాడుతూ కావూరి దేవదాసు పొలానికి ఒక వైపు కమ్మ కులానికి చెందిన గ్రామ సర్పంచ్ శేషయ్య వారి అన్న పొలం ఉందని, మరొకవైపు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారి పొలం ఉందని, ఈ రెండింటి మధ్యలో ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన దేవదాసు పొలం ఉందని, అయితే మిగతా రెండు పొలాల్లో గ్రావెల్ తీయకుండా, కేవలం దళితుడైన కావూరి దేవదాసు పొలంలో మాత్రమే ఇరవై అడుగుల లోతులో, కోటి రూపాయలు పైగా విలువ చేసే గ్రావెల్ తవ్వారని ఆయన అన్నారు. అంటే కేవలం దళితుల పొలాల పైనే నువ్వు కన్నేసి, వారిని బెదిరించి, ఆక్రమించి, డబ్బులు దండుకోవడం సమంజసం కాదని సుజన్ మాదిగ అన్నారు. అతనికి 15 లక్షల రూపాయలు ఇస్తానని చెప్పి, నమ్మించి, గ్రావెల్ తవ్వుకొని ఇవ్వవలసిన డబ్బులు ఇవ్వకపోగా, దేవదాసును వారి భార్యను స్టేషన్‌కు పిలిపించి, భయపెట్టిన విషయం నిజం కాదా అని ఆయన అన్నారు. సుధాకర్ బాబు ఎమ్మెల్యే కాకముందు అతని ఆస్తులు, ఎమ్మెల్యే అయిన తర్వాత ఆయన ఆస్తులపై విచారణ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల అయిన తర్వాత కావూరి దేవదాసు పొలంలో గ్రావెల్‌కి సంబంధించి, ఇస్తానన్న డబ్బులు ఇవ్వాలని, లేని పక్షంలో కలెక్టర్ ఆఫీస్ దగ్గర ధర్నా కార్యక్రమం, మాదిగ సంక్షేమ పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని విలేకరులతో అన్నారు. వీటన్నిటిపై రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి, మరియు జిల్లా ఇన్చార్జి బీద మస్తాన్ రావు, భూమన కరుణాకర్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిలను కలుస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు మాదిగ, ఎంఎస్పి ఎస్ నాయకులు జయరాజు మాదిగ, కన్నా మాదిగ, మంద ఆమోస్ మాదిగ, తేళ్ల శ్రీను మాదిగ, ఇత్తడి కుమార్ మాదిగ, శేఖర్ మాదిగ, శేషు మాదిగ పాల్గొన్నారు.

కట్టెలలోడు ట్రాక్టర్ బోల్తా

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : రోడ్డు మార్జిన్లు గుంతల మయం కావడంతో కట్టెల లోడు ట్రాక్టర్ తిరగబడిన సంఘటన మండల కేంద్రమైన నాగులుప్పలపాడు అమ్మనబ్రోలు రోడ్డులో జరిగింది పొగాకు బేరలు క్యూరింగ్ నిమిత్తం కట్టెల లోడును అమనబ్రోలుకు తీసుకు వెళుతున్న ఏపీ39కేపీ 3601 ట్రాక్టర్ ఆదివారం అగ్రహారం సమీపంలో రోడ్డు మార్జిన్ దిగి ఎక్కే క్రమంలో బోల్తా పడింది. రోడ్డు మార్జిన్లు సక్రమంగా లేక నిత్యం వందల కొద్ది వాహనాలు ప్రయాణించే ఈ రోడ్డులో ప్రమాదాలు చోటు చూసుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహంవ్యక్తంచేస్తున్నారు.

పోలింగ్ ఏర్పాట్లు పూర్తి తహసీల్దార్ శ్రావణ్ కుమార్

విశాలాంధ్ర-దర్శి : దర్శి మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగు పోలిక బూతులను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల సంబంధించి మూడు పోలింగ్ బూత్లను అదేవిధంగా ఎంఎల్సి ఉపాధ్యాయ ఓటర్ల కోసం ఒక బూతును ఏర్పాటు చేయడం జరిగిందని ఉదయం 8 గంటల నుండి పోలింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటు వేసుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నా మన్నారు. పోలింగ్ బూతులు వద్ద షామియానాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన పోలింగ్ బూత్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. దర్శి డిఎస్పి నారాయణస్వామిరెడ్డి పర్యవేక్షణలో సీఐ రామకోటయ్య ఎస్సై రామకృష్ణలు పోలింగ్ బూత్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా పట్టణంలో అన్ని ప్రధాన రహదారులు పోలీసు నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు.

నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని ఆర్టిసి బస్టాండ్ దగ్గర శ్రీనివాస్ నగర్‌లో పాపగట్ల వెంకట సుబ్బారెడ్డి పద్మావతి దంపతులు నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ కార్యక్రమానికి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

పవన్ సమక్షంలో జనసేనలోకి 'ఈదర'

విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్ర బిజెపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు జనసేన పార్టీ తీర్థం తీసుకున్నారు. మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ కండువ కప్పి ఈదరను పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో టిడిపి రెబల్ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఈదర ఆ ఎన్నికలలో గెలిచారు. ఆ తర్వాత కాలంలో కాంగ్రెస్ పార్టీలో చేరటం, ఆతర్వాత వైసీపీలో చేరటం వంటివి చకచకా జరిగిపోయాయి. ఆ తర్వాత బిజెపిలో చేరిన ఈదర గత కొంత కాలంలో మౌనంగా ఉంటున్నారు. ఎన్టీఆర్ కళాపరిషత్ స్థాపించిన ఆయన అనేక సంవత్సరాల పాటు నాకట, నాటికల పోటీలు నిర్వహించారు. ఆ తర్వాత కాలంలో జిల్లాపరిషత్ చైర్మన్‌గా కూడా పనిచేసిన ఈదర గత కొద్దికాలంలో రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అయితే జనరల్ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఈదర జనసేనలో చేరటం జిల్లా వ్యాపితంగా రాజకీయ చర్చకు దారి తీసింది. రానున్న కాలంలో జిల్లాలో ఎటువంటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈదరతోపాటుగా జనసేన పార్టీలోకి పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే వైసీపీ నాయకులు టివి రామారావు తో పాటుగా భీమిలికి చెందిన వైసీపీ కీలక నేతలు చంద్రరావు, అక్కారమాని దివాకర్‌లు జనసేన పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ అధ్యక్షులు నాదెండ్ల మనోహర్, ప్రకాశం జిల్లా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, భీమిలి ఇన్‌చార్జ్ పంచకర్ర సందీప్ పాల్గొన్నారు.

మన్నేపల్లి చంద్రమౌళి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కదిరి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సీఎస్‌పురం గ్రామానికి చెందిన సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మన్నేపల్లి చంద్రమౌళి అకాల మరణం బాధాకరమని కనిగిరి మాజీ ఎమ్మెల్యే కావలి నియోజకవర్గం పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు. చంద్రమౌళి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కదిరి బాబురావు ఆదివారం చంద్రమౌళి నివాసగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చంద్రమౌళి తమ కుటుంబంతో చాల సన్నిహితంగా ఉండేవారని ఆయన లేని లోటు పూడ్చలేనిది అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంభానికి మనోధైర్యాన్ని కల్పించాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ యంపిటీసీ మునగల నారాయణరెడ్డి, పోకల మాల్యాద్రి, మన్నేపల్లి చిన్ని, మన్నేపల్లి సురేష్, తోట అశోక్, సున్నా నారాయణ, మన్నేపల్లి రవి, బోయన మహేంద్ర, సంగిశెట్టి పీరయ్య, రేనాటి వెంకటేశ్వర్లు (ఆర్.వి), మారెళ్ల రవికుమార్, యాళ్ల సాయి, తోట శివ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర-దర్శి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భమై నేటికీ 12 సంవత్సరాల పూర్తి చేసుకొని 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా దర్శి ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ జెండానే ఆవిష్కరించి కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో తిరుగులేని పార్టీ ఏదైనా ఉంది అంటే అది వైసీపీ నేనని పేద బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పాటుపడుతున్న ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది వైసీపీ ప్రభుత్వమేనని. పదికలాలపాటు పార్టీ చల్లగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువ నాయకుడు మద్దిశెట్టి శ్రీధర్, నాయకులు వేన్నపూస వెంకటరెడ్డి, వైవి సుబ్బయ్య. కుమ్మిత అంజిరెడ్డి, సుంకర బ్రహ్మానందరెడ్డి, విసీ రెడ్డి, గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, కందుల నారపరెడ్డి, రహంతుల్లా, బాదం చిన్నిరెడ్డి, గొల్లపోటి అచ్చయ్య, కోరే సుబ్బారావు, పోలయ్య, గురవయ్య, కోడవాటి జాన్, గోపు ఎర్రయ్య, దారం వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

విశాలాంధ్ర-తాళ్లూరు : 13వ తేదీ జరగనున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికలకు గాను ఏర్పాట్లను ఆదివారం తహసిల్దార్ ఎస్ రామ్మోహన్రావు, ఎస్సై బి ప్రేమ కుమార్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రమైన తాళ్లూరులో ఊటుకూరు కోటయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కేంద్రాన్ని పరిశీలించి క్యూ లైన్‌లో ఏర్పాట్లు, ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరా తీశారు. సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ మెజార్టీ సాధించాలి

కొండెపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి

విశాలాంధ్ర - శింగరాయకొండ : స్థానిక వైఎస్ఆర్‌సిపి పార్టీ కార్యాలయంలో పార్టీ 13వ ఆవిర్భావదినోత్సవ వేడుకలు కొండెపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి ఆవిర్భావదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ అభిమానులకు కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మహానేత వైఎస్‌రాజశేఖరరెడ్డి ఆశయాలను నెరవేర్చడానికి ఏర్పడిన వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పేద ప్రజలకు స్వంతపార్టీగా మారేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలే వారది వంటివని వరికూటి పేర్కొన్నారు.

సోమవారం పోలింగ్ జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ఆర్‌కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించడం ద్వారా జగనన్న పాలనకు ఓటర్లలో ఉన్న అనుకూలతను చూపించేలా ప్రయత్నించాలన్నారు. ప్రతి పోలింగ్‌బూత్ వద్ద పార్టీ కార్యకర్తలు ఓటర్లను రప్పించడంతో పాటు నిర్భయంగా వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులకు ఓటు వేసేవిధంగా చూడాలన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రతిపాదించిన పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు నమోదయ్యేలా కృషి చేయాలని కోరారు. ఓటర్లకు ఓటు వేయడంలో ఉన్న అనుమానాలు తీర్చడంలో వారికి సహకరించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పటేల్, యన్నా బత్తినవెంకటేశ్వరరావు, వైస్‌ఎంపిపిరవికుమార్‌రెడ్డి, సలీంభాషా, యన్నాబత్తిన కార్తీక్, సచివాలయం కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, యనమల మాధవి, ప్రకాష్‌రెడ్డి, రాయిరమేష్, సుల్తాన్, రాయిపేర్రాజు,రంగారెడ్డి, వైసిపి కార్యకర్తలు,నాయకులు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - శింగరాయకొండ : ఎమ్మెల్సీ ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తూ శనివారం రాత్రి మండలంలోన సోమరాజుపల్లి గ్రామంలో యన్నాబత్తిన వెంకటేశ్వరరావు(చిన్న) సర్పంచ్ కుమారుడు యన్నాబత్తిన కార్తీక్, నరేంద్రరెడ్డి, సచివాలయం కన్వీనర్లు మాలకొండయ్య, శీలం రమణయ్య, ప్రచారం చేశారు. వీరి ప్రచారానికి గ్రామంలో మంచి స్పందన లభించింది. గ్రాడ్యుయేట్‌లు, ఉపాధ్యాయులు వీరి ప్రచారానికి ఆకర్షితులయ్యారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-పామూరు : ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల అధికారి బిఆర్ఎల్‌వి ప్రసాద్ తెలిపారు. ఆయన ఎన్నికల బూతులను పరిశీలించారు. 25 పోలీస్ స్టేషన్లో 94 మంది పురుషులు, 34 మంది స్త్రీలు ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. అలాగే పట్టభద్రులుకు 45, 46,47 బూతులలో 2371 మంది ఉండగా అందులో పురుషులు 1698, స్త్రీలు 673 మంది ఓటు హక్కును వినియోగించు కోను న్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసాద్ తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-వెలిగండ్ల : నేడు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు సర్వం సిద్ధమైనట్లు ఎంపీడీవో తాతపూడి సుకుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ఎన్నికల ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంపీడీవో సుకుమార్ తెలిపారు. ఓటర్లు తమ ఓటును ప్రశాంతంగా వినియోగించుకోవాలని వారి వారి గుర్తింపు కార్డుతో మీకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్లిప్పులతో పాటు రావాలని తెలిపారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలించిన కలెక్టర్

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-మార్కాపురం : ఈ నెల 13వ తేది సోమవారం జరుగు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ దినేష్ కుమార్ చెప్పారు. ఆదివారం ఆయన మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి ఎం.ఎల్.సీ ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ పోలింగ్ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్నికల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, విధుల నిర్వహణలో సందేహం వస్తే ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల సంఘం ఇచ్చిన హ్యాండ్ బుక్‌లో ఉన్న నిబంధనల ప్రకారం వ్యవహరించాలని చెప్పారు. ఏమైనా సహాయం అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని, జిల్లా కేంద్రంలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కూడా సంప్రదించవచ్చని అన్నారు. అనంతరం మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కేటాయించిన పోలింగ్ కేంద్రంలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. కొనకొనమిట్ల జడ్పీ హైస్కూల్, పొదిలిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కూడా సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ విధులలో పాల్గొనే సిబ్బందికి, పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు చెప్పారు. పోలింగ్ కేంద్రంలో అనవసరమైన రద్దీని నియంత్రించేలా ఓటర్లను వరుసలో నిలుచునేలా సమర్థంగా పర్యవేక్షించాలని చెప్పారు. కాగా, పోలింగ్ సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ చేస్తున్న విధానాన్ని సబ్ కలెక్టర్ సేతు మాధవన్ ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు. అంతకు ముందు ఒంగోలు డివిజన్‌కు సంబంధించి ఒంగోలులోని పి.వి.ఆర్. బాలుర హైస్కూల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కూడా కలెక్టర్ సందర్శించారు. ఎన్నికల సామాగ్రిని తీసుకున్నప్పటి నుంచి పోలింగ్ ముగిశాక వాటిని తిరిగి రిసెప్షన్ కేంద్రాలకు తరలించే వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆయన సూచించారు. కాగా, సిబ్బందికి వీటిని అప్పగించి బస్సులలో తరలించేందుకు తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా ఆర్.డీ.వో విశ్వేశ్వరరావు కలెక్టరుకు వివరించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహిద్దాం

- ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- ఎస్పీ మల్లిక గర్గ్ వెల్లడి

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత పోలింగ్ జరిగేలా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ మల్లికగర్గ్ తెలిపారు. జిల్లాలో సోమవారం జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, దర్శి సబ్ డివిజన్‌ల ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి పాటించాల్సిన నియమాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై ఒంగోలు నందు కాలేజీ లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేసినారు. పోలీస్ అధికారులు మరియు సిబ్బంది ఎన్నికల నియమావళి నిక్కచ్చిగా అమల పరచాలని, పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు ఎవరు గుమికూడకుండా చూసుకోవాలని, పోలింగ్ కేంద్రం లోపలికి నిషేధిత వస్తువులు అయిన మొబైల్ ఫోన్స్, ఐ పాడ్, టాబ్స్ మరియు ఇతర ఎలెక్ట్రానిక్ వస్తువులు, అగ్గిపెట్టే, రసాయన ఇంకు బాటిల్స్, వాటర్ బాటిల్స్ వంటివి తీసుకెళ్ళనీయకుండా అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లు క్యూ లైన్ పాటించేటట్లు చూడాలని, ఓటర్లను పూర్తిగా తనిఖీ చేసి ఓటర్ స్లిప్ మరియు ప్రభుత్వం ఇచ్చిన ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డును మాత్రమే ఓటర్ తో పాటు పోలింగ్ బూత్ లోపలికి పంపాలని, పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేయడం, ఓటర్లను ప్రభావితం చేయడం, బెదిరింపులకు పాల్పడటం వంటివి జరుగకుండా చూసుకోవాలని, ఏదయినా సంఘటన జరిగిన వెంటనే మొబైల్ పార్టీకి గాని, సంబంధిత అధికారికి తెలియజేయాలని, ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ అనంతరం బ్యాలెట్ బాక్సను బస్సులలో తరలింపు సమయంలో రూట్ మొబైల్ పార్టీ సిబ్బంది ఆయా బస్సులకు రక్షణగా ఉంటూ బ్యాలెట్ బాక్సను సురక్షితంగా పోలింగ్ స్టేషన్లకు చేర్చాలని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ సమయస్ఫూర్తితో ఎన్నికల విధులు నిర్వర్తించాలని పోలీస్ సిబ్బందికి ఎస్పీ తెలియచేసారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 38 మండలాలలో ఎన్నికలు జరుగు తున్నాయని, మొత్తం ఎలక్షన్ పోలింగ్ లొకేషన్స్ 51 వాటిలో సెన్సిటివ్ 15, హైపర్ సెన్సిటివ్ -9, మొత్తం 138 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించ దానికి పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేశామన్నారు. ముగ్గురు అడిషనల్ ఎస్పీలు ఒంగోలు రెవిన్యూ డివిజన్ కు ఎఎస్పీ(అడ్మిన్) కె. నాగేశ్వరరావు, కనిగిరి రెవిన్యూ డివిజన్ కు ఎఆర్ ఎఎస్పీ అశోక్ బాబు, మార్కాపురం రెవిన్యూ డివిజన్ కు ఎఎస్పీ(క్రైమ్) శ్రీధర్ రావులను ఇంచార్జిలుగా నియమించామని, 8 మంది డిఎస్పీ లు, 15 మంది ఇన్స్పెక్టర్ లు, 68 మంది ఎస్.ఐ లు, మొత్తం 1500 మందికి పైగా పోలీస్ సిబ్బందితో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే, 8 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 15క్యూఆర్‌టి, 38 స్ట్రైకింగ్ ఫోర్స్, సెక్టార్ మొబైల్స్ 22, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ 38, 11 చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేశామని, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ ప్రాంతాల్లో అధిక సిబ్బంది నియమించ మని తెలిపారు. అభ్యర్థులు, ఓటర్లు, ఏజెంట్లు ఎన్నికల నియమావళిని అధికారి యొక్క ఉత్తర్వులు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎలక్షన్ నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటున్నందన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100మీ దూరం వరకు ఎవరు గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించినా ఎలక్షన్ కమిషన్ వారికి, స్థానిక పోలీసులకు లేదా డయల్ 100/112 కు సమాచారం అందింస్తే తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్ఐ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : నేడు జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలను స్థానిక ఎస్ఐ అనిల్‌కుమార్ పరిశీలించారు. పట్ట భద్రులు, ఉపాధ్యాయుల రెండు పోలిం గ్ కేంద్రాలను మండల కేంద్ర మైన సీఎస్‌పురంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించి పోలీసు సిబ్బందికి తగిన సూచనలు చేశారు. నేడు పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఓటరు స్లిప్పులు అందజేసేవారు ఉండాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎవరైనా ప్రలోభాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లు ముందుగా తమ ఓటు ఉన్నది లేనిది చూసుకొని పోలింగ్ కేంద్రాలకు రావాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించిన వారిలో ఆయనతో పాటు స్థానిక తహశీల్దార్ ఉన్నారు.

బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-బేస్తవారిపేట : వైఎస్సార్ సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని బేస్తవారిపేటలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నదని కొనియాడారు. అనంతరం కేకును కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : నాగులుప్పలపాడు మండల పరిధిలో ఈ నెల13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలవద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసిల్దార్‌అశోక్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నాగులుప్పలపాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన మూడు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల జోనల్ అధికారి పి శ్రీనివాస ప్రసాద్, తహసిల్దార్ అశోక్ కుమార్‌రెడ్డి, ఎంపీడీవో ఏవివి కుమారి, ఎస్సై ఉయ్యాల హరిబాబు, ఇతర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తహసిల్దార్ తెలిపారు. 2084 పట్టబద్రుల, 114 ఉపాధ్యాయుల ఓట్లకు పోలింగ్ జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఓటర్ స్లిప్‌తో పాటుగుర్తింపుకార్డుతో వచ్చిఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళిని అనుసరించి ఓటు హక్కు నమోదు చేసుకోవాలనచేసుకోవాలని తహసిల్దార్ అశోక్ కుమార్‌రెడ్డి తెలిపారు.

బలహీన వర్గాలకు అండగా వైసీపీ

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భమై నేటికి 12 సంవత్సరాలు పూర్తి చేసుకొని 13వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఆదివారం హనుమంతునిపాడు గ్రామంలో ఎంపీడీవో కార్యాలయం నందు మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. గాయం బలరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో తిరుగు లేని పార్టీ ఏదైనా ఉంది అంటే అది వైసీపీ అని అన్నారు. అలానే పేద బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పాటుపడుతున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైసీపీ ప్రభుత్వమేనన్నారు. అలానే పది కాలాలపాటు పార్టీ సల్లగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యక్కంటి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, తిమ్మారెడ్డిపల్లి వైసీపీ ఇంచార్జ్ కస్తాల బాలాజీ, సర్పంచ్ కత్తి రాజారావు, ఆదినారాయణ, మాజీ సర్పంచ్ పిచ్చిరెడ్డి, తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేటి నుంచి సెమిస్టర్ పేపర్ల మూల్యాంకనం

విశాలాంధ్ర-మార్కాపురం : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో 13వ తేదీ సోమవారం నుండి ప్రారంభం అవుతుందని ప్రధానాచార్యులు డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, కోర్సులకు సంబంధించిన తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్, బోటనీ, జువాలీ, కెమిస్ట్రీ, మేతమాటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్‌లతో పాటు లైప్ స్కిల్, స్కిల్ డెవలప్‌మెంట్ పేపర్లకు సోమవారం నుండే మూల్యాంకన సమూహాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని క్యాంపు ఆఫీసర్‌గా కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి శ్రీధర్ కుమార్ వాల్యుయేషన్ ఆఫీసర్‌గా డాక్టర్ ఎం.శేషుకుమార్, స్ట్రాంగ్‌రూమ్ ఆఫీసర్‌గా కె పవన్‌కుమార్, టీచర్ అసోసియేట్‌లుగా డాక్టర్ పిఆర్‌కె ప్రసాద్, సీహెచ్ రాజేష్, ఓ ఏడుకొండలు వ్యవహరిస్తారని డాక్టర్ కె మధుసూదన్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరీక్షల అధికారుల నుండి ఉత్తర్వులు పొందిన మార్కాపురంతో పాటు కంభం, బేస్తవారిపేట, గిద్దలూరు, కొమరోలు, దోర్నాల, ఎర్రగొండపాలెం, దర్శి, పొదిలి, కనిగిరి, పామూరు, దొనకొండ డిగ్రీ కళాశాలల ఎక్జామినర్‌లు 13వ తేది నుండి స్క్రూటినైజర్‌లు 14వ తేదీ మంగళవారం నుండి గుర్తింపుకార్డు, టీచర్ ప్రొఫైల్‌లతో మధ్యాహ్నం 1 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు క్యాంపుకు హాజరు కావాలని క్యాంపు ఆఫీసర్ పి శ్రీధర్‌కుమార్ తెలిపారు.

సీఎం జగన్‌కు మాజీ మంత్రి గాదె అభినందనలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, గాదె మధుసూదన రెడ్డి తమ వర్గీయులతో కలసి వైసిపి అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ప్రాంతీయ పార్టీని స్థాపించి రాజకీయ శక్తులను ఎదుర్కొని పోరాడడం సామాన్యమైన విషయం కాదు అని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి పేర్కొన్నారు.మడమ తిప్పని నాయకుడిగా తండ్రికి మించిన సంక్షేమ పథకాల అమలు చేయగల సత్తా చాటిన ఘనత ముఖ్యమంత్రి వై యస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. గాదె మధుసూదన రెడ్డి మాట్లాడుతూ తమ జీవితాంతం జగన్‌తోనే పయనం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో వై సి పి అభిమానులు అల్లం గోపి కృష్ణ, జిట్ట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతలపాడు వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-పర్చూరు: మండలం లోని నూతలపాడు ఆశ్రయా వృద్ధా శ్రమంలో ఆదివారం ట్రయిఫెన్స్ ట్రస్ట్ చైర్మన్ బీసీ కుమార్ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి స్వీట్లు, పండ్లు అందించారు. ఆశ్రమ నిర్వాహకులు భవనం శ్రీనివాసరెడ్డి, జలయక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

కాకర్లలో విషాదం

దొనకొండ మండల వాసి అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-అర్ధవీడు : మండలంలోని కాకర్ల గ్రామంలో విషాదం అలుము కుంది. దొనకొండ మండలానికి చెందిన ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ప్రేమ్ కుమార్ (18) పొలంలోని రేకుల షెడ్లో పొడవాటి కండువాకు వేలాడుతూ నిర్జీవంగా కనిపించాడు. ఇతను దొనకొండ మండల వాసి. జెసిబి డ్రైవర్ చూసిన వారికీ ఉరేసుకుని చనిపోయాడని అనిపించేలా ప్రేమ్ కుమార్ సంఘటన దృశ్యం ఉంది. అయితే రెండు కాళ్ళ పాదాల వేళ్ళ భాగాలు నేల భాగాన్ని తాకి వున్నాయి. వాటి పక్కన్నే ప్లాస్టిక్ స్టూల్ సాధారణ స్థితోలోనే వుంది. పెట్టిన స్టూల్ పెట్టినట్లుగానే కనిపిస్తోంది. వేలా డేందుకు స్టూల్‌ను కాలితో తన్నినట్లు గాని, పక్కకు నేట్టినట్లుగాని కనిపించలేదు. ముఖంలోని మూతి భాగం ఛిద్రమై రక్తం తీగబారి స్రవిస్తోంది. ముఖానికి ఎడమ చెంప భాగంలో చర్మం ఎర్రగా కందినట్లు కనిపిస్తోంది. కళ్ళు కూడా మూసుకునే వున్నాయి. ఎడమ కంటిపై నుదుటి భాగంలో గాయం కనిపిస్తోంది. పైగా ఉరివేసుకోవడానికి ఎంపిక చేసుకున్న స్థలం రేకుల షెడ్ వరండా కావడం సందేహం కలుగుతోంది. సంఘటన స్థలంలోని ఈ దృశ్యాలు బలవన్మరణానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. పలు అనుమానాలకు తావిస్తుంది. సంఘటనకు దారితీసిన పూర్వ పరాలు పోలీస్ విచారణలో తేలాల్సి వుంది. హెడ్ కానిస్టేబుల్ గోపాల్ రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పౌరసరఫరాల శాఖలో అవినీతి జలగలు!

- యథేచ్ఛగా పొరుగు జిల్లాలకు రేషన్ బియ్యం అక్రమ రవాణా
- బియ్యం అక్రమ రవాణాలో అధికారుల సహకారం
- కార్యాలయానికే పరిమితమైన సివిల్ సప్లై అధికారులు
- రేషన్ షాపుల తనిఖీల ఊసే ఎత్తని అధికారులు
- మిల్లర్లతో డీటీలు ఎఫ్ఐలు మిలాఖత్

విశాలాంధ్ర-పీసీపల్లి : పౌరసరఫరాల శాఖకు అవినీతి జలగలు పట్టిపీడిస్తున్నాయి. పాలకులు అధికారులు మారినా పద్ధతి మాత్రం మారడం లేదు. కొత్త అధికారులు వచ్చినప్పుడు కాస్త హడావుడి చేసినా ఆ తర్వాత సరామామూలే..! ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే రేషన్ బియ్యం వారికి చేరే విధంగా చూడాల్సిన అధికారులు, సిబ్బంది అవినీతి ఉచ్చులో కూరుకుపోతున్నారు. మిల్లర్లు, బయ్యర్లతో మిలాఖత్ అయి నెల నెలా రేషన్ డీలర్ల వద్ద మామూళ్ల కు పాల్పడుతున్నారు. ఒకవైపు రాజకీయ జోక్యం మరోవైపు అవినీతి జలగలతో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం యదేఛగా నల్లబజారుకు తరలిపోతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. పౌరసరఫరాల శాఖలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన అవినీతి జలగలు మామూళ్ల రూపంలో రక్తం పీల్చినట్టు పీలుస్తున్నారు. రేషన్ డీలర్ల వద్ద నుండి నెల నెల ముక్కు పిండి మరీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూసేందుకు పౌరసరఫరాల శాఖలో జిల్లా ఉన్నతాధికారులతో పాటు డివిజన్ స్థాయి అధికారులు ఫుడ్ ఇన్స్పెక్టర్లు డిటిలు ఉన్నారు. అయితే వీరి విధి నిర్వహణను పక్కనపెట్టి వ్యాపారులతో మిలాఖత్ అవుతున్నారని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. గోదాముల నుండి రేషన్ షాప్ కు వెళ్లిన బియ్యం కార్డుదారులకు అందుతున్నాయో లేదు చూడటంతో పాటు అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యంపై దృష్టి పెట్టాల్సిన అధికారులు కార్యా లయానికే పరిమితమవుతూ తమ పరిధిలోని వ్యాపారులతో మిలాఖత్ అవుతున్నారు. నెల రావటమే ఆలస్యం మామూళ్ల కోసం పాకులాడుతున్నట్లు సమాచారం. రేషన్ బియ్యం అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతుంది. పక్క జిల్లాలకు నిత్యం ఆటోలు మినీ లారీల ద్వారా అక్రమంగా రేషన్ బియ్యం రవాణా అవుతున్నప్పటికీ అధికారులు మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్నారు. ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో తప్ప అక్రమ రేషన్ బియ్యం పట్టుకున్న దాఖలాలు లేవు బియ్యం పట్టుకున్న సందర్భాల్లో సైతం 6ఏ కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. అంతేకాక ఏ ఒక్క కేసులో నిందితులకు శిక్ష పడకపోవడం విశేషం దాంతో బియ్యం స్మగ్లర్లు కొన్ని రైస్ మిల్లు యజమానులు నిరభయంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి మళ్లీ ప్రజలకే అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ షాపుల్లో లావుపాటి బియ్యం సరఫరా చేస్తుండడం అందులో నూక శాతం ఎక్కువగా ఉండడంతో అన్నం వండుకుంటే ముద్దుగా తయారవుతున్నడంతో ప్రజలు సైతం రేషన్ షాప్ నుంచి బియ్యం తెచ్చుకొని వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మరికొందరు ఏకంగా డీలర్లకు తమకు వచ్చిన రేషన్ బియ్యాన్ని ఆరు రూపాయలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏదైతేనేమి ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో 60 శాతానికి పైగా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. రేషన్ షాపుల్లో ఈపాస్ మిషన్లు అమలులో ఉండటంతో దొంగ రేషన్ కార్డులు పూర్తిగా కనుమరుగయ్యాయి. నియోజకవర్గ పరిధిలో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసే చిరు వ్యాపారులు బడా వ్యాపారులు అనేక మంది ఉన్నారు. ఈ బియ్యాన్ని నిత్యం ఆటోల ద్వారా మినీ లారీల ద్వారా ఇతర జిల్లాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పాలక పక్ష నేతలు అధికార ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ నేతలు సొమ్ము చేసుకుంటున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. రేషన్ షాప్ డీలర్లు అధికారులు రాజకీయ నాయకులు వాటాలు పంచుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పౌరసరఫరాల అధికారులే కాదు రెవెన్యూ శాఖ అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. చివరకు ప్రోటోకాల్ ఖర్చులు కూడా రేషన్ అవినీతి సొమ్ము వినియోగిస్తున్నారంటూ పలువురు గుసగుసలాడు కుంటున్నారు. అప్పుడప్పుడు తనిఖీలు చేయడం సరుకులలో తేడాలు ఉన్నాయంటూ చర్యలు తీసుకోవటం కొద్దిరోజులకే మళ్లీ కేసులు నమోదు చేస్తున్నామని చెబుతూ రేషన్ బియ్యం అక్రమ వ్యవహారాల్లో నిన్న మొన్నటి వరకు పౌరసరఫరాల అధికారులు డీలర్లు మాత్రమే కుమ్మక్కయి పాలు పంచుకున్నారు. తాజాగా ఇతర శాఖల అధికారులు కూడా సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో మండల స్థాయి రేషన్ డీలర్ల సంఘాల నాయకులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎవరెవరు వాటాలు వారికి పంపే బాధ్యతను ఆ నాయకులే తీసుకుంటున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అంతే కాకుండా రాజకీయ నాయకుల మితిమీరిన జోక్యంతో అవినీతి అన్నిటికంటే మించి దళారులు ఆధిపత్యంతో పేదల కంటే పెద్దలకు ఈ వ్యవస్థ కల్పతరువుగా మారిందేమో అనిపిస్తుంది.